క్లుప్తంగా

నేడు కపిలేశ్వరపురంలో గడప గడపకూ..

కపిలేశ్వరపురం: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం కపిలేశ్వరపురంలో పర్యటించనున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి పర్యటన చేయనున్నట్టు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి తెలిపారు.

పాలడుగు కుటుంబానికి పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల మృతి చెందిన పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు పాలడుగు సత్యవతి కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాజుబాబు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ళ నారయ్యబాబు, నాయకులు పెంకే వెంకట్రావు, పిఠాపురం సత్యనారాయణ, రత్తయ్యలు సత్యవతి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. రాజుబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు పాలడుగు సత్యవతి చేసిన సేవలు ఆదర్శప్రాయమన్నారు.

తుది దశకు సచివాలయ భవన నిర్మాణం



నిర్మాణంలో ఉన్న అంగర సచివాలయ భవనం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర -1 సచివాలయ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. భవనం ప్లాస్టింగ్, సీలింగ్ నిర్మాణ పనులను సోమవారం పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు వారు తెలిపారు.

శివాలయాల్లో భక్తుల సందడి

కాజులూరు: మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కార్తిక సోమవారం, పౌర్ణమి గడియలు కలిసి రావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అండ్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కొలంక, జగన్నాథగిరి గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారు జామున మూడు గంటల నుంచే అభిషేకాలు ప్రారంభ మయ్యాయి.

ద్వారపూడిలో ఎమ్మెల్యే వేగుళ్ల పర్యటన

కపిలేశ్వరపురం (మండపేట): ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేట మండలంలోని ద్వారపూడిలో సోమవారం 'బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించారు. గ్రామస్తులతో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ అధికార పక్షం చెబుతున్న మాటలను నమ్మవద్దని, రానున్నది టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రాబోతుందన్నారు. ఆయన వెంట టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో పాల్గొనే వారి వివరాల నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సచివాలయాల పరిధిలో క్రీడాకారుల వివరాలను నమోదు చేశారు. ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి మట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు మినహా మిగిలిన 15 ఏళ్ల నిండిన వారందరూ ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. గ్రామస్థాయిలో డిసెంబర్ 15 నుంచి 20, మండల స్థాయిలో డిసెంబర్ 21 నుంచి జనవరి 4, నియోజకవర్గ స్థాయిలో జనవరి 5 నుంచి జనవరి 10 వరకూ, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 21, రాష్ట్ర స్థాయి పోటీలను జనవరి 22 నుంచి 26 వరకూ నిర్వహించనున్నారు. కార్యదర్శులు క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి ఆదేశించారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహం లభ్యం



కుందూరులంకలో లభ్యమైన స్వామి విగ్రహం

కె.గంగవరం: కుందూరు లంక గ్రామంలో సోమవారం వేంకటేశ్వర స్వామి విగ్రహం లభ్యమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌కు ఇంటి స్థలంలో మామిడి చెట్టు కింద వేంకటేశ్వర స్వామి విగ్రహం ఉన్నట్టు కల వచ్చింది. దీంతో గ్రామస్తుల సహాయంతో ఉదయం తవ్వకాలు జరిపారు. మూడడుగులు తవ్విన అనంతరం భూమిలో వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యమైంది. దీనికి వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆ నోటా ఈ నోటా విషయం తెలుసుకున్న పలువురు స్వామి విగ్రహాన్ని చూసేందుకు కుందూరు లంకకు తరలి వచ్చారు.

అన్నదాతల్లో కలవరం

- ధాన్యం ఒబ్బిడి పనుల్లో నిమగ్నం
- ఆశాజనకంగా ఖరీఫ్ దిగుబడి
- ఎకరానికి 34 నుంచి 36 బస్తాలు



కె.గంగవరంలో రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం ఎకరానికి 34 నుంచి 36 బస్తాల వరకు దిగుబడి



కె.గంగవరంలో రోడ్డుపై మాసూళ్లు చేస్తున్న కూలీలు

కె.గంగవరం: అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు రావడంతో రైతుల గుండెల్లో కలవరం మొదలైంది. గత మూడు రోజులుగా పంట ఒబ్బిడి పనుల్లో నిమగ్నమయ్యారు. రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు హడావుడిగా వరికోత యంత్రాలతోను, కూలీలను ఎక్కువ మందిని పెట్టి మాసూళ్లు చేసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో సుమారు 6344 హెక్టార్లు, కాజులూరు మండలం 7400 హెక్టార్లు, రామచంద్రపురం మండలాల్లో 7300 వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట కాలం పూర్తి అవ్వడంతో రైతులు కోతలు, మాసూళ్లు ముమ్మరం చేశారు. పంట చేతికందే సమయంలో వర్షాలు పడితే కష్టం అంతా నీటి పాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రిళ్లు కూడా మాసూళ్లు..

వాతావరణంలో మార్పులు రావడంతో వర్షాలు పడితే వరి కోత యంత్రాలు తిరగవని రైతులు రాత్రిళ్లు కూడా వరి కోత పనులు చేస్తున్నారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు మార్కెట్‌కు, సురక్షిత ప్రాంతాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. గతంలో మాసూళ్ల చేసేటప్పుడు వరుణుడు కన్నెర్ర చేయడంతో రైతులు మేల్కొని కొన్ని చోట్ల ధాన్యపు రాశుల వద్దే పడుకుంటున్నారు. నాలుగేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికొచ్చే సరికి భారీ వర్షాలు, తుపాన్లు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొంత మంది పల్లపు ప్రాంత రైతులు క్రాప్ హలిడే కూడా ప్రకటించేవారు. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో మూడు మండలాల్లోను 34 నుంచి 36 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. దాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

ప్రభుత్వ సాయం

ప్రతి ఏడాది అప్పులు చేసి పెట్టుబడి పెట్టేవాళ్లం. ఒక్కొక్కసారి పెట్టుబడి దొరక్కపోతే బంగారం కుదువ పెట్టి మరీ సాగు చేసే వాళ్లం. సీఎం జగన్ పుణ్యమా అంటూ మాకు పెట్టుబడి సాయం కింద సొమ్ములు అందుతున్నాయి. రైతులను కష్టకాలంలో ప్రభుత్వం అదుకుంది.

– చల్లా మోహన్, కె.గంగవరం

కళ్లాల వద్దే ఉంటున్నాం

రెండు రోజులు వాతావరణంలో మార్పలు రావడంతో ధాన్యపు రాశుల వద్దే ఉంటున్నాం. గతంలో కోత కోసి చేతికి అందివచ్చే సమయానికి వర్షాలు వచ్చి తీవ్రంగా నష్టపోయాం. ఇప్పుడు ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలిస్తున్నాం. దేవుడు కరుణిస్తే మరో వారం రోజుల్లో మాసూళ్లు పూర్తి అవుతాయి.

– టి.సుబ్బారావు, భట్లపాలిక

అప్రమత్తంగా ఉండాలి

రైతులు సాయంకాలం వేళ ధాన్యపు కళ్లాలను పగడ్బందీగా కప్పి ఉంచాలి. ధాన్యం ఒబ్బిడైతే వెంటనే సురక్షిత ప్రాంతానికి కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధన్యాం కొనుగోలు కేంద్రాలకు గాని తరలించాలి. పనలపై ఉంటే వెంటనే మాసూళ్లు చేసుకోవడం మంచింది.

– బలుసు రవి, ఏఓ, కె.గంగవరం

కార్తికం.. కమనీయం

- దీప శోభతో అలరారిన శైవాలయాలు
- ముక్కంటికి అభిషేకాలు, విశేష పూజలు



సోమేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ఇప్పనపాడులో ఉమా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ

రాయవరం: కార్తిక పౌర్ణమి, సోమవారం కావడంతో మండలంలో పలు శివాలయాలు శివనామ స్మరణతో అలరారాయి. నమఃశివాయ, హరహర మహాదేవ శంభో శంకర..వంటి నినాదాలతో ఎక్కడ చూసినా సర్వం శివోహం అన్నట్లుగా మారింది. కార్తిక మాసం రెండవ సోమవారం, కార్తిక పౌర్ణమి కావడంతో శివాలయాలకు వేకువ జాము మూడు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని సోమేశ్వరం బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి, రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి, చెల్లూరు శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి తదితర శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. రుద్రుడిని పంచదార, తేనె, పసుపు, కుంకుమ, విభూది, చందనం, పాలు, పెరుగు, ఆవు నెయ్యి పండ్ల రసాలతో అభిషేకించారు. ఉదయం నుంచి ఉపవాసం చేపట్టిన మహిళా భక్తులు సాయంత్రం సమయాల్లో పురోహితులకు స్వయంపాకం అందజేసిన అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. కొందరు దీపాలను కూడా దానం చేశారు. సోమేశ్వరం శివాలయంలో ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో కార్తిక దీపారాధన చేశారు. లింగాకారంలో దీపాలను ఏర్పాటు చేసి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

వర్తక సంఘం ఆధ్వర్యంలో..

సోమేశ్వరం శివాలయంలో స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో 20వ కార్తిక వన సమారాధన నిర్వహించారు. వన సమారాధనలో భాగంగా భారీగా అన్నదానం నిర్వహించారు. సోమేశ్వరం, మాచవరం, కుతుకులూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. వన సమారాధనలో దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో సందడి నెలకొంది. ఉదయానే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారు జామునే అభిషేక పూజలు చేసేందుకు క్యూ కట్టారు. కపిలేశ్వరపురంలోని శ్రీపాప వినాసేశ్వర, అగస్త్యేశ్వరస్వామి, తాతపూడిలోని శ్రీమల్లేశ్వరస్వామి, కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి, పడమర ఖండ్రికలోని త్రయంబకేశ్వరస్వామి, ఖణ్వ లింగేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు.

మండపేటలో...

ఇప్పనపాడులో ఉమా రామలింగేశ్వర స్వామిని ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ యాదగిరి రామకృష్ణ దర్శించుకున్నారు. లక్ష బిల్వార్చన, కుంకుమార్చన, హోమ పూజల్లో పాల్గొన్నారు. వారి వెంట వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు త్రిశూల శ్రీనివాస్, నాయకులు చింత పట్ల మల్లి బాబు, కేశవరం లారీ యూనియన్ అధ్యక్షులు గంధం సూరిబాబు ఉన్నారు.

ఘనంగా వీరభద్రుడికి బోనాలు



వెదురుపాకలో బోనాలు సమర్పించేందుకు ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో సోమవారం వీరభద్రుడి బోనాలు ఘనంగా సమర్పించారు. ఏటా గ్రామస్తులంతా కలిసి వీరభద్రుడికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా వీరభద్రుడ్ని నమ్ముకుని గద్దె నిలుపుకున్న భక్తులు వీరభద్రుడు, వీర గనికమ్మ ప్రతిమలను శిరస్సున ధరించి, గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కుక్కల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులంతా గ్రామంలోని జమ్మి చెట్టు వద్ద సామూహిక పూజలు చేశారు. వీరముష్టిలు విన్యాసాలు భక్తులను అలరించాయి. వెదురుపాక, వి.సావరం, కొంకుదురు గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు వీరభద్రుడికి బోనాలు సమర్పించారు.

భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రామచంద్రపురం రూరల్: కార్తిక సోమవారం పురస్కరించుకుని హసన్‌బాద మాణిక్యాంబా సమేత భీమేశ్వరాయలంలో ఆలయ అర్చకుడు ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో చింతపల్లి నాగ సత్యసూర్యశివప్రసాద్, నాగదేవి దంపతుల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ దంపతుల సౌజన్యంతో ఆలయ అభివృద్ధి కమిటీ నేతృత్వంలో సుమారు 2500 మందికి అన్న ప్రసాదం అందజేశారు. కమిటీ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్పందనకు ఐదు అర్జీలు

రామచంద్రపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐదు అర్జీలు అందినట్లు ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం ఒకటి, ఇంటి పన్ను వేయాల్సిందింగా ఒకటి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఒకటి, వృద్ధాప్య పింఛన్ మంజూరు కోసం ఒకటి, భూ తగాదా పరిష్కరించాలని ఒకటి అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

బీమా సొమ్ము అందజేత

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ-1 గ్రామ సచివాలయం పరిధిలో మృతి చెందిన తుట్టపు ఆదినారాయణ, షేక్ మస్తాన్ కుటుంబాల సభ్యులకు సోమవారం ప్రభుత్వం తరపున అందించే వైఎస్సార్ బీమా తక్షణ సాయం ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ)ల చేతుల మీదుగా అందజేశారు. బీమా సొమ్ములో మిగిలిన రూ. 90 వేలు ఆయా కుటుంబాల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని వెల్ఫేర్ అసిస్టెంట్ బాబీ తెలిపాడు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు డేగల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు పిల్లి శ్రీనివాస్, వలంటీర్లు నజ్మా, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడిదలో జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణ పర్యటన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిదలో సోమవారం జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పర్యటించారు. జన చైతన్య యాత్ర పేరుతో ఇంటింటికి వెళ్ళి పార్టీ సిద్ధాంతాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ ఏడిద గ్రామ అధ్యక్షుడు రామిశెట్టి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్రాకుల అబ్బులు, పట్టణ అధ్యక్షుడు చంద్రరావు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో పొలంబడి

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ ఎ.రాజశేఖర్ ప్రత్యేకంగా పరిశీలనకు వచ్చి పొలంబడి కార్యక్రమంపై రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెల్ల, ఉండూరు, ద్రాక్షారామ, జగన్నాయకులపాలెం, వెలంపాలెం, వేగాయమ్మపేట గ్రామాల్లో రైతు భరోసా/పీఎం కిసాన్ పథకంలో లబ్ధిదారుల వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, డీఆర్‌సీ ఏఓ మనోహర్‌కృష్ణ, గ్రామ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు యనమదల గోవిందు, వీఏఏ రేవతి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి ఆలయంలో పూజలు

కపిలేశ్వరపురం: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని తర్వాణిపేటలోని షిరిడి సాయిబాబా ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పూజలు చేశారు. శివలింగాకారంలో అమర్చిన ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కొప్పిరెడ్డి పద్మావతి, ఎర్నేన ప్రభావతి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, దూలం చక్రయ్య, వెంకటరమణ, పేరూరి మాధవి, పిన్నెడి కృపావతి పాల్గొన్నారు.

ఇంటింటికీ సురక్షిత తాగునీరు

- గ్రామీణులకు సరఫరా చేసేందుకు సన్నాహాలు
- జల్‌జీవన్ మిషన్ ద్వారా చురుగ్గా పనులు
- క్లస్టర్ పరిధిలో 1.50 లక్షల కుటుంబాలకు మేలు



జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా జరుగుతున్న పైపులైను పనులు



ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా జరుగుతున్న వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు

రాయవరం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ కుళాయి పథకాన్ని అమలు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ కుళాయి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే దీని నిమిత్తం రూ. కోట్లలో నిధులు మంజూరయ్యాయి.

సురక్షిత నీటి సరఫరా లక్ష్యంగా..

నీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న మంచి నీరు స్వచ్ఛంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నిత్యం తాగే నీటిలో నైట్రేట్, ఫ్లోరైడ్, సల్ఫేట్, కాల్షియం, ఐరన్ తదితర మూలకాలు ఉంటాయి. వివిధ రకాల రసాయనాల వల్ల తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరికీ అవసరమైన మూలకాలు ఉండే తాగునీటిని అందించడం దీని ప్రధాన ఉద్దేశం. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో సురక్షితమైన తాగునీటి సరఫరాకు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం గ్రామాల్లో పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 2024కి గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి రోజుకు 55 లీటర్ల సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు రచించి, అమలు చేస్తున్నారు.


క్లస్టర్ పరిధిలో పరిస్థితి ఇదీ:

క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 94 గ్రామాలు ఉండగా, ఆవాస ప్రాంతాలు 209 ఉన్నాయి. ఈ గ్రామాలు, ఆవాస ప్రాంతాల పరిధిలో 86,500 కుటుంబాలున్నాయి. గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో రెండు విడతలుగా మంజూరు చేశారు. మొదటి విడతలో 181 పనులను రూ.54.41 కోట్ల విలువైన పనులు, , రెండవ విడతలో 90 పనులను రూ.40.09 కోట్ల విలువైన పనులు మంజూరు చేశారు. ప్రస్తుతం మొదటి విడత పనులు గ్రామాల్లో చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి కుటుంబానికి 55 లీటర్ల వంతున 86,500 కుటుంబాలకు రోజుకు 47.57 లక్షల నీటిని అందజేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో ప్రధానంగా బోరు నీటి ద్వారా సురక్షితమైన అందిస్తున్నారు. సురక్షిత మంచినీటిని అందించడంలో భాగంగా నీటిలో మలినాలను తెలుసుకునేందుకు, జిల్లాలో అమలాపురం, రావులపాలెంలో నీటి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

జల్‌జీవన్ మిషన్‌లో మంజూరైన పనులు, నిధులు

మండలం	ఫేజ్–1	నిధులు(కోట్లలో)	ఫేజ్–2	నిధులు రూ.కోట్లలో
రాయవరం	29	రూ.10.73	16	రూ.11.86
మండపేట	17	రూ.11.28	06	రూ.03.45
కపిలేశ్వపురం	32	రూ.12.32	15	రూ.05.43
ఆర్‌సీపీఎం	51	రూ.18.00	18	రూ.07.25
కె.గంగవరం	52	రూ.02.80	35	రూ.12.04

పనుల వేగవంతానికి కృషి



జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. రోజూ జరుగుతున్న పనులను సమీక్ష చేసి, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షితమైన మంచినీటిని ప్రతి కుటుంబానికి అందించడం ప్రభుత్వ ఉద్దేశం. దీనికనుగుణంగా ప్రజలు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఏజీ రామారావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మండపేట సబ్ డివిజన్

గోమాత ముక్కోటి దేవతల స్వరూపం



గొల్లపాలెంలో గోపూజ నిర్వహిస్తున్న మహిళలు

కాజులూరు: ఆవు ముక్కోటి దేవతల స్వరూపమని ఆవుని పూజిస్తే సకలదేవతలను పూజించినట్టేనని కాకినాడ జిల్లా మూడో అదనపు కోర్టు ఏపీపీ సత్తి గంగాదేవి అన్నారు. సోమవారం గొల్లపాలెం జర్నలిస్టుకాలనీలో ఆధ్యాత్మిక వేత్త వీరవల్లి గణపతిసిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన గోపూజా కార్యక్రమాల్లో ఆమె మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో ఆవుకు ఉన్న విషిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, అనీల్, సాయిసునీల్, అబ్బులు, దెయ్యాల సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

కార్తిక సందడి



యండగండి శివాలయంలో స్వామివారికి అభిషేకాలు చేస్తున్న వేదపండితులు

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా కోటిపల్లి, పామర్రు, కె.గంగవరం, యర్రపోతవరం, భట్లపాలిక తదితర గ్రామాల్లోని శివాలయాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటిపల్లిలో ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం వద్ద పలు గ్రామాలకు చెందిన భక్తులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీదేవి పూజలకు కావల్సిన ఏర్పాట్లు చేశారు. దంగేరు, తామరపల్లి, సత్యవాడ, కోటిపల్లి గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాల స్వీకరించారు.

ద్రాక్షారామకు పోటెత్తిన భక్తులు



శ్రీ భీమేశ్వరస్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో ఉన్న మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు వెల్లువెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో భక్తులు కుంకుమ పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములు జరిగాయి. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాలలో ఆవు నేయి వత్తులను వినియోగించి దీపారాధన చేవారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కనుల పండువగా జ్వాలా తోరణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం కార్యక్రమం ఆదివారం రాత్రి ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.